

## ఓటు బ్యాంకు కోసమే ఎస్సీ వర్గీకరణ

ఎస్సీ వర్గీకరణ మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టేలా ఉందని ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి నాయకులు అన్నారు. రాజంపేట సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. - 8లో



## ద్విచక్రవాహనాలు ఢీకొని..

ద్విచక్ర వాహనాలు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి వాల్మీకిపురం సమీపంలో చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో మరో ఇద్దరికి గాయాలయ్యాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)



| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.270 | రూ.300 |
| రెండోరకం | రూ.210 | రూ.266 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 432 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 235 | 455 |
| సీబీ | - | - |

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 551.440 కిలోలు

## న్యూస్‌రీల్

### మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

రాయచోటి (జగదాంబ సెంటర్) : జిల్లాలో 2024–25 విద్యా సంవత్సరంలో జరగనున్న నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్‌ఎంఎంఎస్) పరీక్ష కోసం 8వ తరగతి చదువుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి శివ ప్రకాష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత, వసతి సౌకర్యం లేని ఏపీ మోడల్ స్కూల్‌లలో 8వ తరగతి చదువుతూ, కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. డిసెంబర్ 8వ తేదీన జరిగే ఈ పరీక్షకు సెప్టెంబర్ 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు www.bse.ap.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

### 'జవహర్ నవోదయ'లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి (జగదాంబసెంటర్): అన్నమయ్య జిల్లా మదనపల్లి మండలం వలసపల్లి, రాజంపేట మండలం నెరమరాజుపల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యా శాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ నెల 16వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### ఏపీఎంపై చర్యలు తీసుకోవాలి

రాయచోటి : గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో అవినీతికి పాల్పడి సస్పెన్షన్‌కు గురైన మండల సమాఖ్య లీడర్ మాధవికి వత్తాసు పలుకుతున్న ఏపీఎం రజనిపై చర్యలు తీసుకోవాలని నిమ్మనపల్లి మండల మహిళా లీడర్లు కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం నిమ్మనపల్లి మండలం పరిధిలోని 32 గ్రూపుల మహిళా లీడర్లు, సభ్యులు కలెక్టర్‌ను కలిసి ఏపీఎం అవినీతిపై ఫిర్యాదు చేశారు. అంతకు ముందు కలెక్టర్ కార్యాలయం ఎదుట వారు నిరసన వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల సమయంలో పసుపు కుంకుమ డబ్బులు రూ. 17 లక్షలు కాజేసినట్లు విచారణలో నిర్ధారణ కావడంతో మాధవిని విధుల నుంచి తొలగించారన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం వచ్చాక ఆమెను తిరిగి విధుల్లోకి తీసుకురావాలని గ్రూపు సభ్యుల ద్వారా ఏపీఎం తప్పుడు నివేదికలు తయారు చేస్తున్నారన్నారు. ఏపీఎం నుంచి తమకు రక్షణ కల్పించాలని వారు కోరారు.

### చట్ట పరిధిలో సమస్యలకు పరిష్కారం

– జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వారితో మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : చట్ట పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 45 అర్జీలను స్వీకరించారు. అర్జీదారులతో జిల్లా ఎస్పీ ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా భూకబ్జాలు, ఆర్థిక నేరాలు, రైతులను మోసం చేయడం, మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడటం లాంటి చర్యలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.

### గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ జామ్

చింతకొమ్మదిన్నె : కడప–రాయచోటి ప్రధాన రహదారిలోని గువ్వల చెరువు ఘాట్ రోడ్డులోని నాలుగో మలుపు వద్ద సోమవారం రాత్రి రోడ్డుకు అడ్డంగా లారీ నిలబడిపోయింది. దీంతో ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సీకేదిన్నె ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి వెంటనే స్పందించి తమ సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్రేన్ సహాయంతో రోడ్డుకు అడ్డంగా ఉన్న లారీని తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

### వైవీయూ డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షలు ప్రారంభం


వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు ఇన్‌స్టంట్ పరీక్షలు సోమవారం వైవీయూలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు డిగ్రీ ఐదో సెమిస్టర్ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని కళాశాల విద్యార్థులు విశ్వవిద్యాలయ కేంద్రంలో హాజరయ్యారు.



'నా పేరు భక్తుల రమణరాజు. మాది కలికిరి మండలం, చీకటిపల్లి పంచాయతీ రంగనాథపురం. నాకున్న ఆరు ఎకరాలలో గత అక్టోబర్ మాసంలో బొప్పాయి పంట సాగు చేశాను. కలికిరి సమీపంలోని ఎల్లారెడ్డిపల్లి నర్సరీలో బొప్పాయి నారు తెచ్చి నాటాను. ఎనిమిది నెలలు పూర్తి అయినా బొప్పాయి కాయలు ఎదుగుదల లేదు. మే నెల చివరి నుంచి జూన్, జూలై నెలల్లో మంచి దిగుబడి వచ్చి మార్కెట్‌కి తరలించే సమయం. కానీ నాసిరకమైన నారు కారణంగా పంట, యాభై గ్రాముల సైజులో ఉన్న కాయలలో ఎదుగుదల లేకపోగా అదే సైజులోనే మాగి రాలిపోతున్నాయి. ఈ పంట సాగుకోసం 12 లక్షల రూపాయలు ఖర్చు చేశాను. దిగుబడి రాకపోగా పెట్టుబడి వడ్డీలు పెరిగి మోపెడు అవుతున్నాయి. మరో రెండు నెలలు గడిస్తే అప్పులు ఇచ్చిన వారు వడ్డీలతో సహా వసూలు చేయడానికి ముందుకు వస్తారు. వారికి ఏమి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. నాసిరకం నారుపై నర్సరీ యజమానిని ప్రశ్నించినా ఫలితం లేదు. జరిగిన నష్టంపై జిల్లాలోని బొప్పాయి రైతులతో కలిసి అన్నమయ్య జిల్లా కలెక్టర్‌కు విన్నవించుకున్నా లాభం లేదు. జిల్లాలో అనేక మంది బొప్పాయి, మిరప, టమాటా, తదితర పంటలను సాగుచేసిన రైతులు నాసిరకం నార్లతో నష్టాలపాలు కావాల్సి వస్తోంది'.



'నా పేరు మిన్నంరెడ్డి శ్రీహరి రెడ్డి. మాది పీలేరు మండలం. 15 ఎకరాల భూమిని ఆరు లక్షల రూపాయలకు గుత్తకు తీసుకొని బొప్పాయి పంటను సాగు చేశాను. ఇప్పటి వరకు 30 లక్షల రూపాయలు ఖర్చు చేశాను. నాటినప్పటి నుంచి చిన్న బిడ్డలా కాపాడుకుంటూ వచ్చాను. తీరా పిందె దశ నుంచి ఎదగకుండా మోటుబారి పోతుండటంతో కడుపు కాలిపోతోంది. సుమారు కోటి రూపాయల వరకు ఆదాయం వస్తుందని ఆశించిన మాకు కన్నీళ్లు మిగిలాయి. నేను కలికిరి దగ్గర ఉన్న ఎల్లారెడ్డిపల్లె నర్సరీ నుంచి బొప్పాయి నారు తెచ్చి సాగు చేశాను. జరిగిన పంట నష్టం గురించి నర్సరీ యజమానితో మాట్లాడటానికి వెళ్తే అందుబాటులో లేదు. నాలాగా ఎంతోమంది పండ్లతోటలను సాగుచేసిన రైతులు నాసిరకం నార్లతో పంటలను దెబ్బతీసుకొని ఆర్థికంగా నష్టపోతున్నారు. నాసిరకం నారును విక్రయిస్తున్న నర్సరీదారులపైన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. నష్టపోయిన రైతులను ఆదుకోవాలి. ఇలా పీలేరు, కలికిరి, వాయల్పాడు, పెద్దమండ్యం, మదనపల్లి, గుర్రంకొండ, కలకడ, రాజంపేట, చిట్వేలి, పుల్లంపేట, రైల్వేకోడూరు తదితర ప్రాంతాలలోని బొప్పాయి రైతులు ఆయా ప్రాంతాలలో ఉన్న నర్సరీలలోని నాసిరకం నారు తీసుకొచ్చి నాటి నష్టాలపాలయ్యారు'.



కలికిరిలో ఎదుగూ బొదుగూ లేకుండా బొప్పాయి కాయలతో ఉన్న చెట్టు

# రైతును ముంచినారు!

- నాసిరకం నారుతో నట్టేట మునిగిన రైతులు
- రైతుల గోడు పట్టించుకోని ప్రభుత్వం

రాయచోటి : వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తున్న రైతుల అమాయకత్వాన్ని కొంతమంది వ్యాపారులు అలుసుగా చేసుకొంటున్నారు. నాసిరకంగా నారు మడులతో నట్టేట ముంచుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అధికారికంగా 426 నర్సరీలు ఉన్నాయి. ఇవే కాకుండా అనధికారికంగా మరో వంద నర్సరీల్లో పండ్లతోటలు, కూరగాయల నారును పెంచి రైతులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. కొంతమంది నర్సరీ నిర్వాహకులు నాసిరకం విత్తనాలతో పెంచిన నార్లను రైతులకు అంటగడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో అందుబాటులో ఉన్న నీటితో డ్రిప్ ఇరిగేషన్ ద్వారా పండ్లతోటలు, కూరగాయల సాగు అత్యధికంగా ఉంటుంది. పండ్లు, కూరగాయలు, ఆకు కూరల తోటలు 75 వేల హెక్టార్లలో సాగులో ఉన్నాయి.

### నిబంధనలు పాటించని నర్సరీలు

నకిలీ విత్తనాల బెడద దీనికితోడు నాసిరకం నారు సమస్య అంతకంతకూ పెరిగిపోతోంది. తత్ఫలితంగా వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రైతులకు ప్రాణసంకటంగా మారింది. రైతులకు నారును విక్రయించే నర్సరీ నిర్వాహకులు నిబంధనలకు నీళ్లొదుతున్నారు. నర్సరీల నిర్వహణపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడింది. నాసిరకం నారుతో రైతులను దగా చేస్తున్నా వారిపై చర్యలు లేవు. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అంతేకాకుండా అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.



### పంట సాగు రైతుల అదృష్టం

ముఖ్యంగా ఉద్యానవన పంటలు పండించే రైతులు మేలు రకం విత్తనాలు, నాణ్యమైన నారును పొందడటమంటే వారి అదృష్టాన్ని పరీక్షించుకోవాల్సి వస్తోంది. విత్తన సేకరణలో అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నా నాణ్యమైన విత్తనాలు దొరకడం కష్టతరంగా మారింది. ఊరూపేరు లేని బ్రాండ్లు పదుల సంఖ్యలో నర్సరీల్లో దర్శనం ఇస్తున్నాయి. అలాంటి విత్తనాలతో తయారు చేసిన నారు కొనుగోలు చేసిన రైతుల పరిస్థితి దారుణంగా తయారవుతోంది. ప్రధాన వాణిజ్య పంటల సాగులో 60 శాతం వరకు నాసిరకం, కల్తీ విత్తనాలను వినియోగిస్తున్నట్లు పలు సర్వేలలో వెల్లడైంది. ముఖ్యంగా బొప్పాయి, టమాటా, మిరప, వంకాయ తదితర రకాల విత్తనాలలో జన్యు స్వచ్ఛత లోపించింది. జిల్లాలో 5 వేల ఎకరాలలో బొప్పాయి పంటను సాగు చేయగా అందులో 2 వేల ఎకరాలకు పైగా నాసిరకం నారుతో 300 మందికి పైగా బొప్పాయి రైతులు నష్టపోయి రోడ్డెక్కారు. జిల్లాలోని బొప్పాయి రైతులు రైతు సంఘం నాయకులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. జిల్లా అధికారులు మాత్రం నష్టపరిహారం ఇస్తామన్న నమ్మకాన్ని కల్పించడం లేదని రైతులు వాపోతున్నారు.



కలికిరిలో కాయలు లేని బొప్పాయి చెట్టు

### లైసెన్సులు రద్దు చేస్తాం



నకిలీ విత్తనాలు, నాసిరకం నార్లు రైతులకు విక్రయిస్తే నర్సరీల లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించాం. నాసిరకం బొప్పాయి నారులను అందించిన నర్సరీల యాజమానులకు నోటీసులు ఇచ్చాము. బొప్పాయి పంటలు నష్టపోయిన రైతుల సమాచారాన్ని నివేదిక రూపంలో తయారు చేసి కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపిస్తాం. ఎప్పటికప్పుడు ఉద్యాన అధికారుల ద్వారా నర్సరీలను తనిఖీ చేయిస్తూ వారికి పలు సూచనలు అందజేస్తుంటాం.

– రవిచంద్రబాబు, అన్నమయ్య జిల్లా ఉద్యాన అధికారి.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్ ఆవరణంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో భారతీయ జెండాతో సెల్ఫీ, సంతకాల సేకరణ కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లాలో ప్రతి ఇంటిమీద భారతీయ జెండా ఎగురవేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జాతీయ జెండాతో సెల్ఫీ కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన పోస్టర్ దగ్గర జాతీయ జెండాను పట్టుకొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సంతకాల సేకరణకు ఏర్పాటు చేసిన పోస్టర్‌పై జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్‌ఓ సత్యనారాయణ రావు, జిల్లా పర్యాటకశాఖ అధికారి నాగభూషణం, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### 15 నుంచి సెప్టెంబర్ 30 వరకు రెవెన్యూ సదస్సులు

జిల్లాలో ఈ నెల 15 నుంచి సెప్టెంబర్ 30 వరకు భూ సమస్యలపై రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రెవెన్యూ సదస్సుల నిర్వహణపై కలెక్టర్ రెవెన్యూ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భూసమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సుల కార్యక్రమానికి శ్రీకారం చుడుతోందన్నారు. ఈ నెల 15వ తేదీన రెవెన్యూ సదస్సులను లాంఛనంగా ప్రారంభిస్తామన్నారు. రెవెన్యూ సదస్సులను విజయవంతం చేసేందుకు ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. 15వ తేదీ నుంచి సెప్టెంబర్ 30 వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించి షెడ్యూల్‌ను సిద్ధం చేసి పంపాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.




జాతీయ జెండాతో సెల్ఫీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

### 21న రైల్వేకోడూరుకు డిప్యూటీ సీఎం రాక

ఈ నెల 21వ తేదీన రైల్వేకోడూరు మండలం మైసూరువారిపల్లెలో నిర్వహించే రెవెన్యూ సదస్సులో ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్ పాల్గొంటున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. ఇందుకు సంబంధించి మైసూరువారిపల్లెలో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

### 20న నులిపురుగు నివారణ కార్యక్రమం

రాయచోటి టౌన్ : ఈ నెల 20వ తేదీన నులిపురుగు నివారణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నులిపురుగు నివారణ కరపత్రాలను ఆరోగ్యశాఖ అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1–19 సంవత్సరాల మధ్య వయస్సు వారికి ఉచితంగా ఈ మాత్రలను మింగిస్తారన్నారు. 20వ తేదీన ఈ మాత్రలు తీసుకోలేని వారికి ఈ నెల 28న అందజేస్తామన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

## విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి అవసరం

- నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు
- అట్టహాసంగా ప్రారంభమైన రీజినల్ స్థాయి అథ్లెటిక్స్ మీట్

మదనపల్లె సిటీ : విద్యార్థి దశ నుంచే క్రీడలపట్ల ఆసక్తి పెంచుకోవాలని జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ గోవిందరావు అన్నారు. సోమవారం స్థానిక చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయ రీజినల్ స్థాయి అథ్లెటిక్స్ మీట్ అట్టహాసంగా ప్రారంభమైంది. పోటీలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ నవోదయ విద్యాలయాల్లో క్రీడల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. అనుభవం కలిగిన పీడీలతో విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్నట్లు తెలిపారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వేలాయుధన్, క్రీడా ఉపాధ్యాయులు సురేంద్రరెడ్డి, హెచ్.కొటాయి, అధ్యాపకులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. నవోదయ హైదరాబాదు రీజియన్‌కు చెందిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నారు.

### గెలుపొందిన క్రీడాకారులు

- అండర్–17 బాలుర విభాగంలో డిస్కస్‌త్రో శివ సాగర్ (చిత్తూరు క్లస్టర్–మొదటి స్థానం)
- అండర్ –14 షాట్‌పుట్ విభాగంలో నైనిక కె.ఎస్ (చిత్తూరు క్లస్టర్–మొదటి స్థానం)
- అండర్–14 బాలుర విభాగంలో త్రోబాల్ విభాగంలో పార్థ(బళ్లారి క్లస్టర్ –మొదటి స్థానం)
- అండర్ –17 బాలికల విభాగంలో జావెలిన్ త్రోలో స్నేహ సి కలహాల్ (బళ్లారి క్లస్టర్ –మొదటి స్థానం)
- అండర్ –19 బాలుర విభాగంలో జావెలిన్‌త్రో కె.సాయిరామ్ (మెదక్ క్లస్టర్–మొదటి స్థానం)
- అండర్‌ర్‌-19 డిస్కస్‌త్రో విభాగంలో ఫరియా (చిత్తూరు క్లస్టర్–మొదటి స్థానం)

వీరికి ప్రిన్సిపాల్ గోవిందరావు మెడల్స్, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.



రీజినల్ స్థాయి అథ్లెటిక్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ గోవిందరావు



షాట్‌పుట్‌లో పాల్గొన్న క్రీడాకారుడు

## గ్రామ సచివాలయాన్ని దౌర్జన్యంగా తరలించుకుపోయారు

సబ్ కలెక్టర్‌కు మాలేపాడు పంచాయతీ ప్రజల ఫిర్యాదు

మదనపల్లె : కోట్లు ఖర్చుచేసి, అన్ని వసతులతో అందరికీ అందుబాటులో ఉండేలా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ఏ మాత్రం వసతులు లేని చోటకు తరలించుకు వెళ్లారని సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు మాలేపాడు పంచాయతీలోని ప్రజలు ఫిర్యాదు చేశారు. రాజకీయ కక్షలతో కావాలనే కొందరు దౌర్జన్యంగా ఈ చర్యకు పాల్పడ్డారని వారు పేర్కొన్నారు. సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మాలేపాడు పంచాయతీ కత్తివారిపల్లె, వెంకటన్నగారిపల్లె, దేవళంపల్లె, పచ్చిపాలవాండ్లపల్లె, గౌరివిమానుమొరం, కొత్తూరు, ఎగువదొనబైలు, దిగువదొనబైలు, కృష్ణాపురం, బొంతవారిపల్లె, కుల్లోనిగడ్డ, మద్దిగుండ్లపల్లె గ్రామస్తులు గ్రామ సచివాలయ తరలింపుపై ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ రెండునెలల క్రితం కొంతమంది దౌర్జన్యంగా సచివాలయ తలుపులు పగలగొట్టి, రికార్డులు, ఫర్నీచర్, కంప్యూటర్ సామగ్రిని బలవంతంగా తీసుకెళ్లి ఏ మాత్రం వసతులు లేని మాలేపాడు యూపీ స్కూల్ ఆవరణలోని చిన్నగదిలో పెట్టి గ్రామ సచివాలయంగా ప్రకటించారన్నారు. దీనిపై పలుమార్లు విన్నవించినా అధికారులు పట్టించుకోలేదన్నారు.



గ్రామ సచివాలయం తరలింపుపై సబ్ కలెక్టర్ మేఘస్వరూప్‌కు ఫిర్యాదు చేస్తున్న ప్రజలు

## మాజీ ఎమ్మెల్యే కుమారులపై ఫిర్యాదు

మదనపల్లె : తంబళ్లపల్లె నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే గట్టు నరసింగరావు కుమారులు భూ అక్రమాలకు పాల్పడుతున్నారంటూ బి.కొత్తకోట మండలం మొటుకుపల్లె ఆరిమానిపెంట, ముడియంవారిపల్లె గ్రామస్తులు సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. రైతులు చంద్రప్ప, బెస్త రామకృష్ణ మాట్లాడుతూ..తమ ఇద్దరి వద్ద భూమిని అమ్ముతామని మాజీ ఎమ్మెల్యే కుమారులైన ఆలూరి సుబ్రహ్మణ్యం, సుధాకర్‌లు డబ్బులు తీసుకున్నారన్నారు. భూములు రిజిస్టర్ చేయించాలని కోరితే కాలయాపన చేశారన్నారు. ఇప్పుడు వేరొకరికి అమ్మేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసిందన్నారు. మొటుకుపల్లె రైతు శివ మాట్లాడుతూ తనను కూడా ఇలాగే మోసగించారని తెలిపారు.

## స్టాఫ్ నర్సుల నియామకానికి గ్రీన్‌సిగ్నల్

నేటి నుంచే కౌన్సెలింగ్

కడప రూరల్ : ఐదో విడత స్టాఫ్ నర్స్ నియామకాలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఇందులో భాగంగా మంగళవారం నుంచి సుమారు 206 మందికి నియామక కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. నిజానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో వైద్య ఆరోగ్య శాఖ విభాగాల్లో వివిధ కేడర్‌లకు సంబంధించి పెద్ద ఎత్తున నియామకాలు జరిగాయి. అందులో భాగంగా కడపలోని వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్–4) పరిధిలో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ నియామకాలు పెద్ద సంఖ్యలో జరిగాయి.

### ఇప్పటికే నాలుగు విడతల్లో నియామకాలు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023 నవంబర్‌లో స్టాఫ్ నర్స్ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. 10 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. నిబంధనల ప్రకారం, మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జాబితాను సిద్ధం చేశారు. నాలుగు విడతలుగా నియామక కౌన్సెలింగ్‌ను నిర్వహించారు. ఒక విడతకు 100 మందికి పైగా నియామక పత్రాలను అందజేశారు. ఐదవ విడతలో పులివెందుల, మదనపల్లె, ఆదోని మెడికల్ కాలేజీల్లో మొత్తం 206 మందిని స్టాఫ్ నర్స్ నియామకాలను చేపట్టడానికి జాబితాను సిద్ధం చేశారు. అంతలోపే ఎన్నికల కోడ్ రావడంతో నియామక ప్రక్రియ నిలిచింది. అనంతరం టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన మొదట్లోనే స్టాఫ్ నర్స్ నియామక ప్రక్రియను నిలుపుదల చేశారు. దీంతో కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు నిరాశగా వెనుతిరిగారు. పైగా వారిలో ఐదవ విడత నియామకాలపై సందిగ్ధం నెలకొంది. ఎట్టకేలకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో 206 మంది స్టాఫ్ నియామకాలకు మార్గం సుగమమైంది. ఇంకా 200 మందికి పైగా స్టాఫ్ నర్స్ నియామకాలు జరగాల్సి ఉంది.



వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (ఫైల్)

### రోజుకు 50 మంది చొప్పున కౌన్సెలింగ్



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, నిబంధనల మేరకు 206 మందికి కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ నియామకాలు చేపడుతున్నాం. రోజుకు 50 మందికి చొప్పున కౌన్సెలింగ్ నిర్వహిస్తాం. ఈ నెల 13, 14, 16, 17వ తేదీల్లో కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తున్నాం. ఇందుకు సంబంధించిన సమాచారంను ఎంపికైన అభ్యర్థులకు తెలియపరిచాం. అభ్యర్థులు సకాలంలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి.

– డాక్టర్ శ్రీనివాసులు, రీజనల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం.

## క్లుప్తంగా

### పాడి రైతులను ఆదుకోవాలి


జి.శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

రాయచోటి : పాల ధర పెంచి పాడి రైతులను ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రైతుల నుంచి పాలసేకరణకు జగన్ ప్రభుత్వం అమూల్ కంపెనీతో ఒప్పందం చేసుకుందన్నారు. అమూల్ పాల సేకరణ ధర పెంచడంతో పోటీ పెరిగి ప్రైవేట్ డెయిరీలు సైతం ధరలను పెంచడంతో పాడి రైతులకు మేలు కలిగిందన్నారు. గతంలో గేదె పాలు లీటరు రూ.70 నుంచి రూ. 80లు వరకు, ఆవు పాలు లీటరు రూ.35 నుంచి రూ. 40ల వరకు ధర ఉండేదన్నారు. దాణా, గడ్డి, పశువుల వైద్యం ఖర్చు పెరగడంతో పాడి రైతులు ఇబ్బందిపడుతున్నారన్నారు. పాడి పరిశ్రమను బలోపేతం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

### నీటి కుంటలో పడి మహిళ మృతి


రత్నమ్మ (ఫైల్)

రామసముద్రం : నీటి కుంటలో పడి మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం రామసముద్రం మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం మేరకు.. ఎలకపల్లె పంచాయతీ కురప్పల్లె గ్రామానికి చెందిన నారాయణస్వామి భార్య రత్నమ్మ (60) సోమవారం పొలం వద్దకు వెళ్తూ ప్రమాదవశాత్తూ దారి ప్రక్కన ఉన్న నీటి కుంటలో పడి ఊపిరాడక మృతి చెందారు. ఈ విషయాన్ని ఆలస్యంగా తెలుసుకున్న కుటుంబసభ్యులు నీటి కుంట నుంచి రత్నమ్మ మృతదేహాన్ని వెలికితీశారు.

### ద్విచక్ర వాహనాలు ఢీకొని.. వృద్ధుడు మృతి


మృతి చెందిన నల్లప్ప

వాల్మీకిపురం : ద్విచక్ర వాహనాలు ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి వాల్మీకిపురం సమీపంలో చోటుచేసుకుంది. మదనపల్లి మండలం గుండవారిపల్లికి చెందిన నల్లప్ప (65) తన అల్లుడితో కలసి ద్విచక్ర వాహనంపై వాల్మీకిపురంలోని గురుకుల పాఠశాలకు వచ్చి వారి పిల్లలతో మాట్లాడి.. తిరిగి గ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యంలోని సబ్ జైల్ సమీపంలో ఎదురుగా వస్తున్న మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో నల్లప్ప మృతి చెందగా.. మరో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్సై శ్రీహరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రామసముద్రం : మండలంలోని ఊలపాడు పంచాయతీ నరసాపురం మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కారు అదుపు తప్పి రోడ్డు ప్రక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న కిషోరాచారి, నారాయణాచారి, ఎర్రప్పచారి స్వల్పంగా గాయపడ్డారు. గమనించిన నరసాపురం గ్రామస్థులు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించేందుకు సహాయం చేశారు. ప్రమాదం జరిగిన సమయంలో కరెంటు లేకపోవడంతో ప్రయాణికులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు.

# పసుపు రంగు కప్పలు!



గుర్రంకొండలో సోమవారం ఉదయం కురిసిన వర్షాలకు పసుపు రంగు కప్పలు కనిపించాయి. సాధారణంగా వర్షాలు కురిసిన తరువాత ఆకుపచ్చ రంగు, బూడిద, నలుపు రంగుల కప్పలు కనిపించడం సాధారణం. తొలిసారిగా గుర్రంకొండలో కురిసిన వర్షాలకు పసుపురంగులో కప్పలు కనిపించాయి. ఇలాంటి కప్పలను చూడడం ఇదే తొలిసారి అని రైతులు చర్చించుకున్నారు.

– గుర్రంకొండ

# పోరాటాలతో విద్యారంగ పరిరక్షణ


మాట్లాడుతున్న ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి

రాయచోటి అర్బన్ : విద్యార్థుల పోరాటాలతోనే విద్యారంగ పరిరక్షణ సాధ్యమవుతుందని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణంలో సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేలా కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం తీసుకువచ్చి విద్యను ప్రైవేటీకరించే దిశగా అడుగులు వేస్తోందన్నారు. విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్న జ్యోతీరావు పూలె, భగత్‌సింగ్, అంబేద్కర్, పెరియార్, నారాయణగురుల జీవితచరిత్ర, డార్విన్ సిద్ధాంతాలపై పాఠ్యాంశాలను తొలగించి బ్రిటీషు వారికి తొత్తుగా ఉన్న సావర్కర్ చరిత్రను చేర్చడం దారుణమన్నారు. కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం పునరుద్ధరించాలంటూ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు, రాయచోటి నేతలు ప్రశాంత్, కార్తిక్, నాగార్జున, మధు, వెంకటేష్ పాల్గొన్నారు.

# విద్యార్థులు భాగస్వాములు కావాలి

రాయచోటి (జగదాంబసెంటర్) : రాయచోటి ప్రభుత్వ డైట్ కళాశాలలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర జీవ వైవిధ్య మండలి ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వక్తృత్వ, డిబేట్, షార్ట్ ఫిల్మ్ పోటీలు జరిగాయి. ఏపీ ఎన్జీసీ జిల్లా కోఆర్డినేటర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ జీవ వైవిధ్య పరిరక్షణ మనందరి బాధ్యత అని, అరుదైన వృక్ష జంతు సంపదను కాపాడుకోవాలని అన్నారు. విజేతలకు ఆగస్టు 15న రాయచోటిలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో కలెక్టర్ సర్టిఫికెట్, జ్ఞాపిక అందజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

**విజేతలు వీరే :** వక్తృత్వంలో దివ్య(బీసి బాలికల గురుకులం, కలికిరి), థౌసిఫ్ అహ్మద్(జడ్పీ హైస్కూల్, మాసాపేట), నాసిర్ హుస్సేన్(జడ్పీ బాలుర హైస్కూల్, గాలివీడు) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. డిబేట్‌లో జడ్పీ హైస్కూల్ మాసాపేట, బీసీ బాలికల గురుకులం కలికిరి, టి.చదివేవాండ్లపల్లి పాఠశాలలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలవగా, షార్ట్ ఫిల్మ్ చిత్రీకరణలో లక్కిరెడ్డిపల్లి కేజీబీవీ విద్యార్థులు నిలిచారు.

# కారు ఢీ కొని.. ఆటో డ్రైవర్ దుర్మరణం

బి.కొత్తకోట : బైక్‌పై మదనపల్లెకు వెళ్తున్న యువకుడిని కారు ఢీకొనడంతో దుర్మరణం పాలైన సంఘటన సోమవారం రాత్రి మండలంలో జరిగింది. నీరుగట్టువారిపల్లెకు చెందిన శ్రీనాథ్ (25) ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. రాత్రి బి.కొత్తకోట మండలంలోని కనికలతోపు నుంచి మదనపల్లెకి వెళ్తున్నాడు. మదనపల్లె వైపు నుంచి ములకలచెరువుకు వెళ్తున్న కారు ఖానీ తోపు వద్ద బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన శ్రీనాథ్ అక్కడికక్కడే మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ రవీంద్రనాయక్ సంఘటా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

# ప్రైవేటు బస్సును ఢీకొన్న లారీ


పొదల్లోకి వెళ్లిన భారతి ప్రైవేటు బస్సు

వాల్మీకిపురం : అతివేగంగా వస్తున్న ఐషర్ లారీ.. ఎదురుగా వస్తున్న ప్రైవేటు బస్సును ఢీకొన్న సంఘటనలో లార డ్రైవర్ మృతి చెందారు. పోలీసుల వివరాల మేరకు.. తిరుపతి నుంచి బెంగళూరుకు వెళ్తున్న భారతి ప్రైవేటు బస్సును మదనపల్లి నుండి తిరుపతికి వెళ్తున్న ఐషర్ లారీ అతి వేగంగా వచ్చి ఢీకొంది. బస్సు డ్రైవర్ చాకచక్యంగా పొదల్లోకి తీసుకెళ్లడంతో బస్సులో ప్రయాణికులకు పెనుప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్ సర్వర్ ఖాన్ అలియాస్ బాబూజీ తీవ్ర గాయాలతో లారీలోనే ఇరుక్కుపోయాడు. వాల్మీకిపురం సీఐ పులిశేఖర్, ఎస్సైలు నాగేశ్వరరావు, శ్రీహరి సంఘటనాస్థలానికి చేరుకొని డ్రైవర్‌ను బయటకు తీసి తిరుపతి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**లారీ బోల్తా: తప్పిన ప్రమాదం**

వాల్మీకిపురం : ప్రమాదవశాత్తూ లారీ బోల్తా పడిన సంఘటన వాల్మీకిపురంలో ఆదివారం చోటు చేసుకొంది. విజయవాడ నుంచి మదనపల్లికి వెళ్తున్న లారీ వాల్మీకిపురం పొలిమేర మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.



### జీతం అడిగినందుకు మహిళపై దాడి


దాడికి గురైన పావని

రైల్వేకోడూరు అర్బన్ : జీతం అడిగినందుకు మండలంలోని అనంతరాజుపేట సమీపంలోని అరబిక్ హోటల్‌లో పనిచేస్తున్న దళిత మహిళ సుంకేశుల పావనిపై హోటల్ యజమాని అరిసా దాడి చేశారు. బాధితురాలు, ఆమె భర్త సోమవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.




### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఆహ్వానం


రెడ్డిబాబు, వెంకటలక్ష్మీలతో ఎంపీడీఓ వెంకటరామిరెడ్డి, బ్లాక్ కో-ఆర్డినేటర్

లక్కిరెడ్డిపల్లి : పీఎం ఆవాస్ యోజన పథకం కింద ఎంపికైన వీరబల్లి వెంకటలక్ష్మీ, వీరబల్లి రెడ్డిబాబులు సోమవారం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఈ ఆదర్శ దంపతులు ఆగస్టు 15వ తేదీన డిల్లీలోని ఎర్రకోటలో జరగబోవు స్వాతంత్ర్య వేడుకలలో పాల్గొంటారని ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లికి చెందిన ఈ దంపతులకు రాను పోనూ విమానం టికెట్లు, ఢిల్లీలో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. బ్లాక్ కో-ఆర్డినేటర్ వెంకటరామిరెడ్డి, సూపరిటెండెంట్ గురుప్రసాద్ వీరిని అభినందించారు.

### అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

పెద్దతిప్పసముద్రం: బి.కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు బరువు తక్కువ పరిమాణంలో ఉన్న కోడి గుడ్లను సరఫరా చేస్తున్నారు. దీంతో చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు అసహనం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం సాక్షి పత్రికలో వెలువడిన 'గోళీ గుడ్లు సరఫరా' కథనంకు ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ స్పందించారు. పీడీ ఆదేశాల మేరకు సీడీపీఓ భాగ్యమ్మ, ఆయా సూపర్‌వైజర్లతో కలసి బి.కొత్తకోట ప్రాజెక్టు పరిధిలో ఉన్న మూడు మండలాల్లోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి కోడిగుడ్లను పరిశీలించారు.

### బస్సులను రద్దుచేయాలి

ఓబులవారిపల్లె : కండీషన్ లేని బస్సులను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు శెట్టిపల్లి సాయికిమార్, సర్వేపల్లి నరసింహ డిమాండ్ చేశారు. ఓబులవారిపల్లె మండలం అయ్యలరాజుపల్లెలోని శ్రీవాణి స్కూల్‌కు చెందిన మినీ బస్సు ప్రమాదానికి గురై చిన్నారి మృతి చెందిందన్నారు. కండీషన్ లేని బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై అనేక సార్లు ఆర్టీఓకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

### అధికారులపై చర్యలు తీసుకోండి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సాయికుమార్

రాయచోటి అర్బన్ : నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి.. ఒకే భవనంలో మూడు పాఠశాలలు, కళాశాలలకు అనుమతులిచ్చిన విద్యా, అగ్నిమాపకశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని హ్యూమన్ రైట్స్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు శెట్టిపల్లె సాయి కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్‌ను సోమవారం కలిసి సమస్యలను విన్నవించారు. సాయికుమార్ మాట్లాడుతూ మదనపల్లె పట్టణంలోని నారాయణ పాఠశాల, కళాశాల, జ్ఞానాంబిక జూనియర్ కళాశాలలు నిభంధనలకు విరుద్ధంగా ఒకే భవనంలో నిర్వహించేందుకు అధికారులు అనుమతులిచ్చారన్నారు. మరుగుదొడ్ల వసతి, ఆడుకునేందుకు మైదానం లేదన్నారు. అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

### స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి


నిరసన ప్రదర్శిస్తున్న గంగాధర్, ఆశా వర్కర్లు

రైల్వేకోడూరు అర్బన్ : అన్నమన్య జిల్లాలోని స్కీమ్ వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, అక్రమంగా తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసి జిల్లా కార్యదర్శి గంగాధర్ డిమాండ్ చేసారు. స్థానిక తాహశీల్దారు కార్యాలయం వద్ద ఆశావర్కర్లతో కలిసి నిరసన ప్రదర్శించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, స్కూల్ స్వీపర్, తదితర కార్మికులపై వేధింపులు ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో యశోద, మౌనిక, రత్నమ్మ, చంద్రకళ, విజయమ్మ, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

### వన్‌టౌన్ సీఐ మానవత్వం


అనారోగ్యం పాలైన బాధితురాలిని ఆసుపత్రికి తీసుకెళ్తున్న సీఐ చాంద్ బాషా

మదనపల్లె : వన్ టౌన్ సీఐ చాంద్‌బాషా మానవత్వం చాటుకున్నారు. పట్టణంలోని నక్కలదిన్నెకు చెందిన రామదాసునాయక్ భార్య మల్లిరెడ్డమ్మ(43) ఆదివారం అర్ధరాత్రి ఇంటి వద్ద జరిగిన గొడవ విషయంగా వన్ టౌన్ స్టేషన్ కు ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. స్టేషన్ ఆవరణలో ఉన్నట్టుండి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆమెను చూసిన సీఐ చాంద్‌బాషా తన వాహనంలో ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ లో భాగంగా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల సత్ప్రవర్తనతో మెలగాలని సూచించినట్లు సీఐ తెలిపారు. సీఐ స్పందించిన తీరుకు డీఎస్పీ కొండయ్య నాయుడు అభినందించారు.

### ముత్తుమారెమ్మకు పూజలు


అమ్మవారికి పాలపూజ చేస్తున్న దృశ్యం

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లిలో వెలసిన ముత్తుమారమ్మ తల్లి జాతరలో భాగంగా చివరి రోజున అమ్మవారికి పాలపూజ ఘనంగా జరిగింది. మహిళలు భక్తి శ్రద్ధలతో పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం దివంగత సేలం సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం ఆయన కుమారులు సేలం సురేష్ బాబు, సేలం సుధాకర్ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ కిరణ్ కుమార్, నాగరాజా రావు, తిప్పాయపల్లి ప్రశాంద్, రెడ్డయ్య, మనీ పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం



**మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు**

రైల్వేకోడూరు అర్బన్ : కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుచేయకుండా, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేస్తూ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకూ పేద, మధ్య తరగతి ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై పథకం ప్రకారం దాడులు చేస్తూ పక్కదోవ పట్టిస్తున్నారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు, హత్యలు, దాడులు, దౌర్జన్యాలు, విధ్వంసాలు పరిశీలిస్తే ఆటవిక పాలనను తలపిస్తోందన్నారు. కొత్త పథకాలు ఇవ్వకపోగా.. ఉన్న పథకాలు ఆపేసి దోపిడీలు, దౌర్జన్యాలకు తెరలేపారని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు ప్రచార సభలలో ఆశలు రేకెత్తించి..గెలిచాక పథకాల రూపురేఖలు లేకుండా చేసారని విమర్శించారు. చంద్రబాబు, లోకేష్‌లు 12కు పైగా కేసులున్న నాయకులు మాత్రమే తన వద్దకు రావాలని చెప్పడం అరాచకాలకు నిదర్శనమని పేర్కొన్నారు. పథకం ప్రకారమే వైఎస్.జగన్ మోహన్‌రెడ్డికి సెక్యూరిటీ కుదించారన్నారు. తుప్పుపట్టిన బుల్లెట్‌ప్రూఫ్ వాహనం కేటాయింపు ఇవ్వడం కుట్రలో భాగమేనని తెలిపారు.

# ఓటు బ్యాంకు కోసమే ఎస్సీ వర్గీకరణ

- దళితుల మధ్య చిచ్చుపెట్టడానికే వర్గీకరణ అంటూ నినాదం
- సబ్ కలెక్టరేట్‌లో ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నిరసన
- అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన మాలనేతలు


సబ్ కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

రాజంపేట : ఎస్సీ వర్గీకరణ మాల, మాదిగల మధ్య చిచ్చుపెట్టేలా ఉందని ఎస్సీ వర్గీకరణ పోరాట సమితి నాయకులు అన్నారు. రాజంపేట సబ్ కలెక్టరేట్ ఎదుట సోమవారం పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏళ్లు గడచినా.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల జీవన విధానం అధ్వానంగా ఉందన్నారు. రాజకీయ స్వార్థం కోసం దళితులను నిట్టనిలువునా చీల్చారన్నారు. దళితులకు 15 శాతం రిజర్వేషన్ ఇచ్చి దాదాపు 77 ఏళ్లు అవుతోందన్నారు. పార్లమెంటులో బిల్లుపెట్టి మెజార్టీ ఎంపీల అభిప్రాయం తీసుకోవాలన్నారు. వివిధ రాష్ట్రాల శాసన నిర్ణయాలు, మాల, మాదిగల కులగణన లెక్కలు తేల్చి సుప్రీంకోర్టుకు చెప్పిన తర్వాత ఏ నిర్ణయం తీసుకున్నా స్వాగతిస్తామన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాడతామన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ వైభోమ్ నైదియాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో దాసరి పెంచలయ్య, పెనుబాల నాగసుబ్బయ్య, జోరేపల్లె భాస్కర్, పోలంరెడ్డి మల్లికార్జున, లింగం సంజీవ్, కొమ్మాఎల్లయ్య, నల్లకదిరగాళ్ల శాంతయ్య, గోశాలదేవి, ఎంవీరమణ, మోడపోతుల సోదరులు రాము, సుధా, శెట్టిపల్లెశేఖర్, పందికాళ్ల జయరాం, పాల్గొన్నారు.

# బాలికపై దాడి కేసులో ఐదుగురు అరెస్టు

బి.కొత్తకోట : ఈ నెల 7వ తేదీన 13 ఏళ్ల బాలికపై దాడి చేసి గాయపరిచిన కేసులో ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్టు సీఐ సూర్యనారాయణ తెలిపారు. స్థానిక బీసీ కాలనీ చెందిన బాలిక ఓ కళ్యాణ మండపం వద్ద మిత్రులతో కలిసి ఫొటో తీసుకుంటుండగా బాలికను, ఆమె స్నేహితుడిని అడ్డుకుని అసభ్యకరంగా తిట్టి కట్టెలు, పైపులు, బెల్టులుతో కొట్టి గాయపరిచినట్టు తెలిపారు. బాలిక మిత్రుడు అడ్డుపడగా అతన్ని కొట్టి గాయపరిచారని తెలిపారు. ఈ ఘటనపై బాధిత బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులైన చాంద్ బాషా, బావాజాన్, అబ్జల్ బాషా, ముజమిల్, కాలేషాలను అరెస్ట్ చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.



### మహిళ అదృశ్యం

మదనపల్లె : పట్టణంలోని చంద్ర కాలనీకి చెందిన హసీన(32) ఈనెల ఒకటో తేదీ నుంచి కనిపించకుండాపోయింది. ఆమెకు 14 సంవత్సరాల క్రితం వివాహం కాగా, ముగ్గురు పిల్లలున్నారు. పెద్ద కుమారుడిని ఇంటి వద్ద వదిలి మిగతా పిల్లలను తీసుకుని కనిపించకుండా వెళ్లిపోయింది. భర్త సాధిక్ లారీ డ్రైవర్ కావడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చిన అతడు పలుచోట్ల గాలించాడు. ఆచూకీ లభించకపోవడంతో సోమవారం టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.